"మధురమైన పిల్లలూ - మీరు ఎంతెంతగా తండ్రిని ప్రేమగా స్మృతి చేస్తారో అంతగా ఆశీర్వాదాలు లభిస్తాయి, పాపాలు తొలగిపోతూ ఉంటాయి"

ప్రశ్న:- తండ్రి పిల్లలకు ఏ ధర్మంలో స్థితులయ్యే మతాన్ని ఇస్తారు?

జవాబు:- బాబా అంటారు - పిల్లలూ, మీరు మీ విచిత్రత యొక్క ధర్మంలో స్థితులవ్వండి, చిత్రము యొక్క ధర్మంలో కాదు. ఏ విధంగా తండ్రి విదేహీ, విచిత్రుడు, అదే విధంగా పిల్లలు కూడా విచిత్రులే, ఆ తర్వాత ఇక్కడకు చిత్రములోకి (శరీరంలోకి) వస్తారు. ఇప్పుడు తండ్రి పిల్లలకు చెప్తారు - పిల్లలూ, విచిత్రులుగా అవ్వండి, మీ స్వధర్మంలో స్థితులవ్వండి. దేహాభిమానంలోకి రాకండి.

ప్రశ్న:- భగవంతుడు కూడా డ్రామా అనుసారంగా ఏ విషయానికి బంధింపబడి ఉన్నారు?

జవాబు:- డ్రామా అనుసారంగా పిల్లలను పతితుల నుండి పావనులుగా తయారుచేయడానికి భగవంతుడు కూడా బంధింపబడి ఉన్నారు. వారు పురుషోత్తమ సంగమయుగములో రావాల్సిందే.

ఓం శాంతి. తండ్రి కూర్చొని ఆత్మిక పిల్లలకు అర్థం చేయిస్తారు - ఓం శాంతి అని అన్నప్పుడు ఆత్మకు తన స్వధర్మం యొక్క పరిచయాన్ని ఇవ్వడం జరుగుతుంది. కావున తప్పకుండా తండ్రి కూడా స్వతహాగా గుర్తుకొస్తారు ఎందుకంటే మనుష్యులు ప్రతి ఒక్కరూ భగవంతుడినే స్మృతి చేస్తారు. కానీ భగవంతుని పూర్తి పరిచయం లేదు. భగవంతుడు తమ పరిచయాన్ని మరియు ఆత్మ యొక్క పరిచయాన్ని ఇవ్వడానికే వస్తారు. పతితపావనుడు అని భగవంతుడినే అంటారు. పతితుల నుండి పావనులుగా తయారుచేయడానికి భగవంతుడు కూడా డ్రామా అనుసారంగా బంధింపబడి ఉన్నారు. వారు కూడా పురుషోత్తమ సంగమయుగములోనే రావలసి ఉంటుంది. సంగమయుగం గురించి అర్థం చేయిస్తారు కూడా. పాత ప్రపంచము మరియు కొత్త ప్రపంచము మధ్యలోనే తండ్రి వస్తారు. పాత ప్రపంచాన్ని మృత్యులోకమని, కొత్త ప్రపంచాన్ని అమరలోకమని అంటారు. మీరు ఇది కూడా అర్థం చేసుకుంటారు - మృత్యులోకములో ఆయువు తక్కువగా ఉంటుంది. అకాల మరణాలు సంభవిస్తూ ఉంటాయి. అదేమో అమరలోకము, అక్కడ అకాల మరణాలు సంభవించవు ఎందుకంటే పవిత్రముగా ఉంటారు. అపవిత్రత వలన వ్యభిచారులుగా అవుతారు మరియు ఆయువు కూడా తగ్గిపోతుంది. శక్తి కూడా తగ్గిపోతుంది. సత్యయుగములో పవిత్రముగా ఉన్న కారణంగా అవ్యభిచారులుగా ఉంటారు. శక్తి కూడా ఎక్కువగా ఉంటుంది. శక్తి లేకుండా రాజ్యాన్ని ఎలా పొందగలిగారు? తప్పకుండా తండ్రి నుండి వారు ఆశీర్వాదాలను తీసుకుని ఉంటారు. తండ్రి సర్వశక్తివంతుడు. మరి వారు ఆశీర్వాదాలను ఎలా తీసుకుని ఉంటారు? తండ్రి అంటారు - నన్ను స్మృతి చేయండి. కావున ఎవరైతే ఎక్కువగా స్మృతి చేసి ఉంటారో, వారే ఆశీర్వాదాలు తీసుకుని ఉంటారు. ఆశీర్వాదాలు అనేవి అడిగి తీసుకునేవి కావు. ఇవి కృషితో పొందేటువంటివి. ఎంత ఎక్కువగా స్మృతి చేస్తారో అంత ఎక్కువగా ఆశీర్వాదాలు లభిస్తాయి అనగా ఉన్నత పదవి లభిస్తుంది. స్మృతే చేయకపోతే ఆశీర్వాదాలు కూడా లభించవు. లౌకిక తండ్రి తన పిల్లలకు ఎప్పుడైనా - నన్ను స్మృతి చేయండి అని చెప్తారా. వారు చిన్నతనం నుండి తమకు తామే అమ్మా-నాన్నా అని అంటూ ఉంటారు. ఇంద్రియాలు చిన్నగా ఉంటాయి. పెద్ద పిల్లలు ఇలా నాన్న-నాన్న, అమ్మా-అమ్మా అని అనరు. వారి బుద్ధిలో - వీరు మా తల్లిదండ్రులు, వీరి నుండి ఈ వారసత్వము లభించనున్నది అని ఉంటుంది. ఇలా అనవలసిన లేక తలచుకోవాల్సిన అవసరం ఉండదు. ఇక్కడైతే తండ్రి అంటారు - నన్ను మరియు వారసత్వాన్ని స్మృతి చేయండి. హద్దులోని సంబంధాలను వదిలి ఇప్పుడు అనంతమైన సంబంధాన్ని స్మృతి చేయాలి. మాకు గతి లభించాలి అని మనుష్యులందరూ కోరుకుంటారు. గతి అని ముక్తిధామాన్ని అంటారు. మళ్ళీ సుఖధామంలోకి రావడాన్ని సద్గతి అని అంటారు. ఎవరు వచ్చినా మొట్టమొదట తప్పకుండా సుఖాన్నే పొందుతారు. తండ్రి సుఖాన్ని ఇవ్వడానికే వస్తారు. తప్పకుండా ఏదో కష్టతరమైన విషయం ఉంది కావుననే దీనిని ఉన్నతమైన చదువు అని అంటారు. చదువు ఎంత ఉన్నతంగా ఉంటుందో, అంత కష్టంగా కూడా ఉంటుంది. అందరూ అయితే పాస్ అవ్వలేరు. అన్నింటికన్నా పెద్ద పరీక్షను చాలా తక్కువమంది విద్యార్థులే పాస్ అవుతారు ఎందుకంటే పెద్ద పరీక్ష పాస్ అయితే ప్రభుత్వము జీతం (ఉద్యోగం) కూడా ఎక్కువగా ఇవ్వాల్సి ఉంటుంది కదా. కొందరు విద్యార్థులు పెద్ద పరీక్షను పాస్ అయిన తర్వాత కూడా ఊరికే అలా కూర్చుని ఉంటారు. ప్రభుత్వము ఎక్కువ జీతం ఇవ్వడానికి వారి వద్ద అంత ధనం లేదు. ఇక్కడ తండ్రి అంటారు - ఎంత ఉన్నతముగా చదువుకుంటారో అంత ఉన్నతమైన పదవిని పొందుతారు. అలాగని అందరూ

రాజులుగా లేక షావుకార్లుగా అవుతారని కూడా కాదు. మొత్తమంతా చదువుపైన ఆధారపడి ఉంది. భక్తిని చదువు అని అనరు. ఇది ఆత్మిక జ్ఞానము, దీనిని ఆత్మిక తండ్రి చదివిస్తారు. ఇది ఎంత ఉన్నతమైన చదువు. పిల్లలకు ఇది కష్టము అనిపిస్తుంది ఎందుకంటే తండ్రిని స్మృతి చేయరు కావున క్యారెక్టర్స్ కూడా బాగుపడవు. ఎవరైతే బాగా స్మృతి చేస్తారో, వారి క్యారెక్టర్స్ కూడా బాగవుతూ ఉంటాయి. వారు చాలా-చాలా మధురముగా, సేవాధారులుగా అవుతూ ఉంటారు. క్యారెక్టర్స్ మంచిగా లేకపోతే ఎవరికీ ఇష్టమనిపించరు కూడా. ఎవరైతే ఫెయిల్ అవుతారో తప్పకుండా వారి క్యారెక్టర్ లో తేడా ఉన్నట్లు. శ్రీ లక్ష్మీ-నారాయణుల క్యారెక్టర్ చాలా బాగుంటుంది. రాముడికి రెండు కళలు తక్కువ అని అంటారు. భారత్ రావణ రాజ్యంలో అసత్య ఖండముగా అయిపోతుంది. సత్యఖండములో కొద్దిగా కూడా అసత్యం ఉండదు. రావణ రాజ్యంలో అసత్యమే అసత్యము. అసత్యమైన మనుష్యులను దైవీ గుణాలు కలవారు అని అనలేరు. ఇది అనంతమైన విషయము. ఇప్పుడు తండ్రి అంటారు - ఇటువంటి అసత్యమైన విషయాలు ఎవరివీ వినకండి, ఎవరికీ వినిపించకండి. ఒక్క ఈశ్వరుని మతాన్నే లీగల్ మతము (నియమబద్ధమైన మతము) అని అంటారు. మనుష్య మతాన్ని ఇల్లీగల్ మతము (నియమవిరుద్ధమైన మతము) అని అంటారు. లీగల్ మతము ద్వారా మీరు ఉన్నతముగా అవుతారు. కానీ అందరూ అలా నడుచుకోలేరు కావున నియమవిరుద్ధంగా అయిపోతారు. కొందరు - బాబా, మేము ఇన్ని సంవత్సరాలు నియమవిరుద్ధమైన పనులు చేసాము, ఇప్పుడిక చేయము అని తండ్రితో ప్రతిజ్ఞ చేస్తారు. అన్నింటికన్నా నియమవిరుద్ధమైనది కామ వికారము యొక్క భూతము. దేహాభిమానము యొక్క భూతమైతే అందరిలోనూ ఉండనే ఉంది. మాయావీ పురుషులలో దేహాభిమానమే ఉంటుంది. తండ్రి అయితే విదేహీ, విచిత్రుడు. కావున పిల్లలు కూడా విచిత్రులే. ఇది అర్థం చేసుకోవలసిన విషయము. ఆత్మలమైన మనం విచిత్రులము, ఆ తర్వాత ఇక్కడికి చిత్రములోకి (శరీరంలోకి) వస్తాము. ఇప్పుడు తండ్రి అంటారు - విచిత్రులుగా అవ్వండి, మీ స్వధర్మంలో స్థితులవ్వండి, చిత్రము యొక్క ధర్మంలో స్థితులవ్వకండి, విచిత్రత యొక్క ధర్మంలో స్థితులవ్వండి, దేహాభిమానంలోకి రాకండి. తండ్రి ఎంతగా అర్థం చేయిస్తారు - ఇందులో స్మృతి యొక్క అవసరం ఎంతగానో ఉంది. తండ్రి అంటారు - స్వయాన్ని ఆత్మగా భావిస్తూ నన్ను స్మృతి చేసినట్లయితే మీరు సతోప్రధానంగా, పవిత్రంగా అవుతారు. అపవిత్రతలోకి వెళ్ళినట్లయితే ఎంతగానో శిక్ష లభిస్తుంది. తండ్రికి చెందినవారిగా అయిన తర్వాత ఏదైనా పొరపాటు జరిగినట్లయితే, వారి గురించి గాయనము ఉంది - సద్గురువుకు నింద తీసుకొచ్చేవారు ఉన్నత స్థానాన్ని, ఉన్నత పదవిని పొందలేరు. ఒకవేళ మీరు నా మతముపై నడిచి పవిత్రంగా అవ్వకపోతే 100 రెట్ల శిక్షను అనుభవించవలసి వస్తుంది. వివేకాన్ని ఉపయోగించాలి. ఒకవేళ మనం స్మృతి చేయలేకపోతే అంతటి ఉన్నత పదవిని కూడా పొందలేము. పురుషార్థం కోసం సమయము కూడా ఇస్తారు. మిమ్మల్ని ఋజువు ఏమిటి అని అడిగితే, ఇలా చెప్పండి - వారు ఏ తనువులోకైతే వస్తారో, ఆ ప్రజాపిత బ్రహ్మా అయితే మనిషి కదా. మనుష్యులకు పేరు శరీరానికి పెట్టడం జరుగుతుంది. శివబాబా అయితే మనిషి కాదు, అలాగే దేవత కాదు. వారిని సుప్రీమ్ ఆత్మ (పరమాత్మ) అని అంటారు. వారు పతితంగా లేక పావనంగా అవ్వరు. వారు అర్థం చేయిస్తారు - నన్ను స్మృతి చేసినట్లయితే మీ పాపాలు అంతమవుతాయి. తండ్రే కూర్చొని అర్థం చేయిస్తారు - మీరు సతోప్రధానంగా ఉండేవారు, ఇప్పుడు తమోప్రధానంగా అయ్యారు, మళ్ళీ సతోప్రధానంగా అయ్యేందుకు నన్ను స్మృతి చేయండి. ఈ దేవతల క్వాలిఫికేషన్స్ (యోగ్యతల) ను చూడండి ఎలా ఉన్నాయి, అలాగే వారి నుండి దయను కోరుకునేవారిని కూడా చూడండి ఆశ్చర్యమనిపిస్తుంది - మేము ఎలా ఉండేవారము, మళ్ళీ 84 జన్మలలో ఎంతగా పడిపోయి పూర్తిగా నష్టపోయాము.

తండ్రి అంటారు - మధురాతి-మధురమైన పిల్లలూ, మీరు దైవీ వంశానికి చెందినవారిగా ఉండేవారు. ఇప్పుడు మీ నడవడికను గమనించండి - ఈ విధంగా (దేవీ-దేవతలుగా) అవ్వగలరా? అలాగని అందరూ లక్ష్మీ-నారాయణులుగా అవుతారని కాదు. అలాగైతే అంతా పుష్పాల తోట అయిపోతుంది. శివబాబాకు కేవలం గులాబీ పుష్పాలనే అర్పిస్తారని కాదు, జిల్లెడు పుష్పాలను కూడా అర్పిస్తారు. తండ్రి యొక్క పిల్లలు, కొందరు పుష్పాలుగానూ అవుతారు, కొందరు జిల్లేడుగా కూడా అవుతారు. కొందరు పాస్ అవుతారు, కొందరు ఫెయిల్ అవుతారు. స్వయం కూడా అర్థం చేసుకుంటారు - మేము రాజుగా అయితే అవ్వలేము. తమ సమానంగానే తయారుచేయటం లేదు అన్నప్పుడు షావుకార్లుగా ఎలా అవుతారు, ఎవరు అవుతారు అన్నది తండ్రికే తెలుసు. ముందుముందు పిల్లలైన మీరు - ఫలానావారు తండ్రికి ఏ విధంగా సహాయకులుగా ఉన్నారు అన్నది కూడా అర్థం చేసుకుంటారు. కల్పకల్పమూ ఎవరెవరు ఏమేమి చేసారో అదే చేస్తారు. ఇందులో తేడా రాదు. తండ్రి పాయింట్లు అయితే ఇస్తూ ఉంటారు. ఈ విధంగా తండ్రిని స్మృతి చేయాలి మరియు ట్రాన్స్ఫర్ కూడా చేసుకోవాలి. భక్తి మార్గంలో మీరు ఈశ్వరార్థం చేస్తారు, కానీ ఈశ్వరుని గురించి తెలియదు. ఉన్నతోన్నతమైనవారు భగవంతుడు అన్నంత వరకైతే అర్థం చేసుకుంటారు. అలాగని వారు ఉన్నతోన్నతమైన నామరూపాలు కలవారు అని కాదు. వారు నిరాకారుడు. మళ్ళీ సాకారంలో ఉన్నతోన్నతమైనవారు

ఇక్కడ ఉంటారు. బ్రహ్మ, విష్ణు, శంకరులను దేవతలు అని అంటారు. బ్రహ్మ దేవతాయ నమః, విష్ణు దేవతాయ నమః, కానీ శివ పరమాత్మాయ నమః అని అంటారు. కావున పరమాత్మ పెద్దవారు అయ్యారు కదా. బ్రహ్మ, విష్ణు, శంకరులను పరమాత్మ అని అనరు. శివ పరమాత్మాయ నమః అని నోటితో అంటారు కూడా, కావున తప్పకుండా పరమాత్మ ఒక్కరే అయినట్లు కదా. దేవతలకు నమస్కరిస్తారు. మనుష్య లోకములో మనుష్యులను మనుష్యులు అని అంటారు. మనుష్యులను పరమాత్మాయ నమః అని అనడము - ఇది పూర్తి అజ్ఞానము. ఈశ్వరుడు సర్వవ్యాపి అని అందరి బుద్ధిలోనూ ఉంది. ఇప్పుడు పిల్లలైన మీరు అర్థం చేసుకుంటారు - భగవంతుడు అయితే ఒక్కరే, వారినే పతితపావనా అని అంటారు. అందరినీ పావనంగా తయారుచేయడం అనేది భగవంతుని పనే. జగద్గురువు మనుష్యులెవరూ కాలేరు. గురువులు పావనంగా ఉంటారు కదా. ఇక్కడైతే అందరూ వికారాల ద్వారా జన్మిస్తారు. జ్ఞానాన్ని అమృతము అని అంటారు. భక్తిని అమృతము అని అనరు. భక్తి మార్గంలో భక్తియే నడుస్తుంది. మనుష్యులందరూ భక్తిలో ఉన్నారు. జ్ఞానసాగరుడు, జగద్గురువు అని ఒక్కరినే అంటారు. తండ్రి వచ్చి ఏమి చేస్తారు అనేది ఇప్పుడు మీకు తెలుసు. వారు తత్వాలను కూడా పవిత్రంగా చేస్తారు. డ్రామాలో వారి పాత్ర ఉంది. తండ్రి నిమిత్తము అవుతారు, వారు సర్వుల సద్గతిదాత. ఇప్పుడు ఇది ఎలా అర్థం చేయించాలి. రావడమైతే ఎంతోమంది వస్తారు. ప్రారంభోత్సవం చేసేటప్పుడు ఈ విధంగా టెలిగ్రామ్ ఇవ్వడం జరుగుతుంది - రాబోయే వినాశనం కన్నా ముందే అనంతమైన తండ్రిని తెలుసుకొని వారి నుండే వారసత్వాన్ని తీసుకోండి. వీరు ఆత్మిక తండ్రి. మనుష్యమాత్రులు ఎవరైతే ఉన్నారో, వారంతా తండ్రి అనే అంటారు. వారు రచయిత కావున తప్పకుండా రచనకు వారసత్వం లభిస్తుంది. అనంతమైన తండ్రి గురించి ఎవరికీ తెలియదు. తండ్రిని మరచిపోవడం కూడా డ్రామాలో రచింపబడి ఉంది. అనంతమైన తండ్రి ఉన్నతోన్నతమైనవారు, వారు హద్దు వారసత్వాన్ని అయితే ఇవ్వరు కదా. లౌకిక తండ్రి ఉన్నా కూడా అనంతమైన తండ్రిని అందరూ తలచుకుంటారు. సత్యయుగములో వారిని ఎవరూ స్మృతి చేయరు ఎందుకంటే అక్కడ అనంతమైన సుఖపు వారసత్వం లభించి ఉంది. ఇప్పుడు మీరు తండ్రిని స్మృతి చేస్తారు. ఆత్మయే స్మృతి చేస్తుంది. మళ్ళీ ఆత్మలు స్వయాన్ని, తమ తండ్రిని, అలాగే డ్రామాను మర్చిపోతారు. మాయ నీడ పడుతుంది. సతోప్రధాన బుద్ధి మళ్ళీ తమోప్రధానంగా తప్పకుండా అవుతుంది. కొత్త ప్రపంచంలో దేవీ-దేవతలు సతోప్రధానముగా ఉండేవారు అన్నది స్మృతిలోకి వస్తుంది. ఇది ఎవ్వరికీ కూడా తెలియదు. ప్రపంచమే సతోప్రధానముగా, బంగారు యుగముగా అవుతుంది. దానిని న్యూ వరల్డ్ (కొత్త ప్రపంచము) అని అంటారు. ఇది ఇనుప యుగపు ప్రపంచము. ఈ విషయాలన్నింటినీ తండ్రే వచ్చి పిల్లలకు అర్థం చేయిస్తారు. కల్పకల్పమూ మీరు పురుషార్థం అనుసారంగా ఏ వారసత్వమునైతే తీసుకుంటారో, అదే లభించనున్నది. మేము ఇలా ఉండేవారము, మళ్ళీ ఇలా కిందకు వచ్చేసాము అని మీకు కూడా ఇప్పుడే తెలిసింది. ఈ విధంగా జరుగుతుంది అని తండ్రే తెలియజేస్తారు. కొంతమంది - మేము ఎంతో ప్రయత్నిస్తున్నాము కానీ స్మృతి నిలవటం లేదు అని అంటారు. ఇందులో తండ్రి లేక టీచర్ ఏమి చేస్తారు, ఎవరైనా చదవకపోతే టీచర్ ఏమి చేస్తారు. టీచర్ ఆశీర్వదించినట్లయితే అందరూ పాస్ అయిపోతారు. చదువులో వ్యత్యాసం అయితే ఎంతో ఉంటుంది. ఇది పూర్తిగా కొత్త చదువు. ఇక్కడ మీ వద్దకు చాలా వరకు పేదవారు, దుఃఖంలో ఉన్నవారే వస్తారు, షావుకార్లు రారు. దుఃఖితులుగా ఉన్నారు అందుకే వస్తారు. షావుకార్లు - మేమైతే స్వర్గంలో కూర్చున్నాము అని భావిస్తారు. వారి భాగ్యములో లేదు, ఎవరి భాగ్యములో ఉంటుందో, వారికి వెంటనే నిశ్చయం ఏర్పడుతుంది. నిశ్చయము కలగడానికి మరియు సంశయము కలగడానికి పెద్ద సమయం పట్టదు. మాయ వెంటనే మరపింపజేస్తుంది. సమయమైతే పడుతుంది కదా. ఇందులో తికమకపడాల్సిన అవసరం లేదు. తమపై తాము దయ చూపించుకోవాలి. శ్రీమతమైతే లభిస్తూ ఉంటుంది. ఎంత సహజముగా తండ్రి తెలియజేస్తారు, స్వయాన్ని ఆత్మగా భావిస్తూ నన్ను స్మృతి చేయండి.

మీకు తెలుసు - ఇది మృత్యులోకము, అది అమరలోకము. అక్కడ అకాల మరణాలు సంభవించవు. క్లాస్ లో విద్యార్థులు నంబరువారుగా కూర్చుంటారు కదా. ఇది కూడా స్కూల్ కదా. మీ వద్ద నంబరువారుగా చురుకైన పిల్లలు ఎవరెవరు అని బ్రాహ్మణీని అడగడం జరుగుతుంది. ఎవరైతే బాగా చదువుతారో, వారు కుడి వైపు ఉండాలి. రైట్ హ్యాండ్ (కుడి చేతి) కి మహత్వము ఉంటుంది కదా. పూజ మొదలైనవి కూడా కుడి చేతితోనే చేయడం జరుగుతుంది. సత్యయుగములో ఏముంటుంది అని పిల్లలు ఆలోచిస్తూ ఉండాలి. సత్యయుగము గుర్తున్నట్లయితే సత్యమైన బాబా కూడా గుర్తుంటారు. బాబా మనల్ని సత్యయుగానికి యజమానులుగా తయారుచేస్తారు. మనకు ఈ రాజ్యం ఎలా లభిస్తుంది అన్నది అక్కడ తెలియదు అందుకే బాబా అంటారు - ఈ లక్ష్మీ-నారాయణులలో కూడా ఈ జ్ఞానం లేదు. తండ్రి ప్రతి విషయాన్ని మంచి రీతిలో అర్థం చేయిస్తూ ఉంటారు, కల్పక్రితం వారు ఎవరైతే అర్థం చేసుకున్నారో వారే తప్పకుండా అర్థం చేసుకుంటారు. అయినా కూడా పురుషార్థం చేయాల్సి ఉంటుంది కదా. తండ్రి వచ్చేదే చదివించడానికి.

ఇది చదువు, ఇందులో ఎంతో వివేకం కావాలి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఈ ఆత్మిక చదువు చాలా ఉన్నతమైనది మరియు కష్టమైనది, ఇందులో పాస్ అయ్యేందుకు తండ్రి స్మృతితో ఆశీర్వాదాలను తీసుకోవాలి. మీ క్యారెక్టర్స్ ను తీర్చిదిద్దుకోవాలి.

2. ఇప్పుడు ఎటువంటి ఇల్లీగల్ (నియమవిరుద్ధమైన) పని చేయకూడదు. విచిత్రులుగా అయి మీ స్వధర్మంలో స్థితులవ్వాలి మరియు విచిత్రుడైన తండ్రి యొక్క లీగల్ మతము (నియమబద్ధమైన మతము) పై నడవాలి.

వరదానము:- తండ్రి యొక్క తోడు ద్వారా పవిత్రతా రూపీ స్వధర్మాన్ని సహజంగా పాలన చేసే మాస్టర్ సర్వశక్తివాన్ భవ

ఆత్మ యొక్క స్వధర్మము పవిత్రత, అపవిత్రత అనేది పరధర్మము. స్వధర్మం పట్ల నిశ్చయం ఏర్పడినప్పుడు, పరధర్మము మిమ్మల్ని కదిలించలేదు. తండ్రి ఎవరు, ఎలా ఉన్నారు అని వారిని యథార్థంగా గుర్తించి తోడుగా పెట్టుకున్నట్లయితే పవిత్రతా రూపీ స్వధర్మాన్ని ధారణ చేయడము చాలా సహజమవుతుంది, ఎందుకంటే సహచరుడు సర్వశక్తివంతుడు. సర్వశక్తివంతుని పిల్లలు అయిన మాస్టర్ సర్వశక్తివంతుల ఎదురుగా అపవిత్రత రాలేదు. ఒకవేళ సంకల్పంలోనైనా మాయ వచ్చిందంటే తప్పకుండా ఏదో ఒక గేట్ తెరిచి ఉన్నట్లు అనగా నిశ్చయంలో లోపం ఉన్నట్లు.

స్లోగన్:- త్రికాలదర్శులు ఏ విషయాన్ని కూడా ఏక కాల దృష్టితో చూడరు, ప్రతి విషయంలో కళ్యాణం ఉందని భావిస్తారు.